

ఆయిల్ పాం రైతుల్లో ఆనందం



- జిల్లాలో ఆయిల్‌పామ్ రైతులకు నిర్వహణ డబ్బులు విడుదల
- 2,332 మంది రైతుల ఖాతాల్లో రూ. 264.718 లక్షల నిధులు జమ
- మూడేళ్ల వ్యవధిలో 8,200 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు
- రానున్న ఏడాదిలో ఆయిల్‌పామ్ పంటను మరింత ప్రోత్సహించేలా రైతులకు అవగాహన
- పంట నిర్వహణ కోసం ఎకరానికి ఏడాదికి రూ. 4,200 అందజేత
- ప్రభుత్వ ప్రోత్సాహంతో జిల్లాలో పెరగనున్న ఆయిల్ పామ్‌సాగు

ఖానాపూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్‌పామ్ పంటను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. జిల్లాలో గత మూడేళ్లుగా ఆయిల్‌పామ్ పంటను సాగుచేస్తున్న రైతులకు నిర్వహణ నిమిత్తం అందజేయాల్సిన డబ్బులను తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు జిల్లాలో 2,332 మంది రైతులకు రూ.264.718 లక్షల నిధులను విడుదల చేసింది. ఈ డబ్బులను ఆయిల్‌పామ్ రైతుల ఖాతాలలో నేరుగా జమ చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. రాబోయే ఏడాదిలో ఆయిల్‌పామ్ చేసే రైతుల సంఖ్యను మరింత పెంచాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ఇన్నాళ్లు రైతులకు పెండింగ్‌లో ఉన్న నిర్వహణ ఖర్చుల తాలూకు నిధులను సైతం మంజూరు చేసినట్లు చెబుతున్నారు. ఆయిల్‌పామ్ సాగుచేసే రైతన్నకు అన్ని విధాలుగా అండగా నిలవాలని ప్రభుత్వం ఒక స్పష్టమైన ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో జిల్లాలోని ఆయిల్‌పామ్ సాగుచేస్తున్న రైతుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. గత మూడేళ్లలో జిల్లాలో 3,351 మంది రైతులు 8,200ల ఎకరాల్లో ఆయిల్‌పామ్ పంటను సాగు చేశారని అధికారులు వెల్లడిస్తున్నారు. గత మూడేళ్లలో సాగు చేసిన ఆయిల్‌పామ్ పంటకు నిర్వహణ నిధులను ప్రభుత్వం మంజూరు చేయడం ద్వారా ఈ పంటను మరింత ప్రోత్సహించి జిల్లా రైతాంగాన్ని ఆయిల్ పామ్ వైపు తీసుకెళ్లేందుకు అధికార యంత్రాంగం కృషి చేస్తోంది.

ఆయిల్‌పామ్ నిర్వహణ నిధుల విడుదల

జిల్లాలో ఆయిల్‌పామ్ పంటను సాగుచేస్తున్న రైతులకు నిర్వహణ నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. జిల్లాలో జనరల్ విభాగంలో 1896 మంది రైతులకు, ఎస్సీ విభాగంలో 208 మంది రైతులకు, ఎస్టీ విభాగంలో 228 మంది రైతులకు మొత్తం జిల్లావ్యాప్తంగా 2,332 మంది రైతులకు రూ.264.718 లక్షల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నిధులు ఇప్పటికే జిల్లాలోని రైతుల ఖాతాలలో జమ చేసినట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. 2022-23 సంవత్సరంలో 1322 మంది రైతులు, 2023-24 సంవత్సరంలో 1548 మంది రైతులు, 2024-2025 సంవత్సరంలో 481 మంది రైతులు ఆయిల్‌పామ్ పంటను సాగు చేసినట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు. సదరు ఆయిల్ పామ్ రైతులకు ఆయిల్ పామ్ పంట నిర్వహణతో పాటు సదరు వ్యవసాయ క్షేత్రంలో అంతర పంట నిర్వహణకు ఎకరానికి ఏడాదికి రూ. 4,200ల చొప్పున నిర్వహణ డబ్బులను విడుదల చేసింది.

ఆయిల్‌పామ్ ప్రోత్సహించే దిశగా అడుగులు

జిల్లాలో ఆయిల్‌పామ్ పంటను ప్రోత్సహించేందుకు అధికార యంత్రాంగం అడుగులు వేస్తోంది. గత మూడేళ్లలో 8,200ల ఎకరాల్లో ఆయిల్‌పామ్ పంటను సాగుచేయగా రానున్న ఏడాదిలో ఆ సంఖ్యను మరింత పెంచాలని లక్ష్యంతో ఉద్యానవన శాఖ అధికారులు శ్రమిస్తున్నారు. ఆయిల్‌పామ్ పంటను సాగుచేయడం ద్వారా కలిగే లాభాలను ఎప్పటికప్పుడు రైతులకు వివరించేందుకు అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆయిల్‌పామ్ కన్సల్టెంట్ రిటైర్డ్ సైంటిస్ట్ బిఎన్ రావు లాంటి అనుభవజ్ఞులతో



జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుపై ఇందివరకే అవగాహన సదస్సులను నిర్వహించారు. రానున్న ఏడాదిలో ఆయిల్ పామ్ పంటసాగు విస్తీర్ణాన్ని మరింత పెంచి రైతులను సంప్రదాయ పంటల వైపు నుంచి వాణిజ్య పంటల వైపు మళ్లించి లాభాలబాటలో నడిపించడమే లక్ష్యంగా ఉద్యానవన శాఖ శ్రమిస్తున్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. పంట సాగులో ఏమైనా ఇబ్బందులు ఏర్పడితే మండలాల వారీగా ఆయిల్ పామ్ క్లస్టర్ అధికారిని ఏర్పాటు చేసి రైతుల సమస్యల పరిష్కరిస్తున్నారు. నాలుగైదు మండలాలకు ఆర్టికల్చర్ అధికారి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తూ ఆయిల్‌పామ్ పంటను సంరక్షించే దిశగా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నట్లు చెబుతున్నారు. ఆయిల్‌పామ్ సాగుచేసిన రైతులందరితో ఏ మండలానికి ఆ మండలంలో వాట్సాప్‌గ్రూప్‌ను ఏర్పాటు చేసి ఎప్పటి కప్పుడు పంట తాలూకు ఫోటోలు వాటికి సోకిన చీడపీడల వివరాలను సదరు సోషల్ మీడియా గ్రూపులో పోస్ట్ చేసేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఆ వాట్సాప్ గ్రూపులలో అధికార యంత్రాంగం సైతం భాగస్వాములుగా ఉంటూ సమస్య నెలకున్న వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి ఆ సమస్యను పరిష్కరిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

నిర్వహణ డబ్బులు ఖాతాలో జమయ్యాయి



- భీమ్‌రెడ్డి, ఆయిల్‌పామ్ రైతు, గ్రామం ధని

2022-23 సంవత్సరంలో నాలుగున్నర ఎకరాలలో ఆయిల్ పామ్ పంటసాగు చేశాను. మూడో ఏడాదికి సంబంధించిన ఆయిల్‌పామ్ పంట నిర్వహణ కోసం 18,900 ఇటీవల ఖాతాలో జమయ్యాయి. ప్రస్తుతం మా వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్ పంట ఆశాజనకంగా ఉంది. ఇతర రైతులు కూడా ఆయిల్‌పామ్ సాగు వైపు ఆలోచన చేస్తే బాగుంటుంది.

రాబోయే ఏడాదిలో ఆయిల్‌పామ్ సాగుపెంచేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నాము

- బీవీ రమణ, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి

జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులకు నిర్వహణ డబ్బులు విడుదలయ్యాయి. రైతుల ఖాతాలలో ఇదివరకే సదరు డబ్బులను జమ చేశాం. రాబోయే ఏడాదిలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణాన్ని మరింత పెంచేలా కృషి చేస్తున్నాం.

ఆస్తిని గుంజుకుని మనోవేదనకు గురి చేస్తున్నాడు

- కొడుకు ఇబ్బంది పెడుతున్నాడని ఎస్పీకి మొరపెట్టుకున్న వృద్ధుడు



ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న వృద్ధుడు

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : కడుపున పుట్టిన కొడుకే తమను కాల్చుకు తింటున్నాడని... ఉన్న ఆస్తిని గుంజుకొని తమను తీవ్ర మనోవేదనకు గురిచేస్తున్నాడని సొంత కొడుకు పైనే ఓ వృద్ధుడు తన కూతురితో కలిసి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసిన ఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే బాధితుడు తెలిపిన కథనం ప్రకారం... దిలావర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన బెల్లాల నర్సయ్య అనే వృద్ధుడి పెద్ద కుమారుడైన లక్ష్మీనారాయణ తన తండ్రి పేరుతో ఉన్న ఆస్తిని తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న అనంతరం కన్న తల్లిదండ్రులను, సోదరులను తీవ్రంగా వేధిస్తూ మనోవేదనకు గురి చేస్తున్నాడు. దీంతో అతని ప్రవర్తనపై విసుగు చెందిన ఆ తండ్రి బుధవారం జిల్లా ఎస్పీ జానకీషర్మిలను కలిసి తమ ఆవేదనను చెప్పుకున్నాడు. దీంతో ఆ వృద్ధుడి ఆవేదనను విన్న ఎస్పీ జానకీషర్మిల అతని సమస్యను పరిష్కరించాలని దిలావర్‌పూర్ ఎస్సై సందీప్‌ను ఆదేశించారు. వారికి తగిన న్యాయం జరిగేలా చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు.

నేటి నుంచి సదరం క్యాంప్

నిర్మల్ రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మీ సేవ ద్వారా స్లాట్ బుక్ చేసుకొని వెయిటింగ్ లిస్టులో ఉన్న దివ్యాంగులకు ఈ నెల 10, 11వ తేదీల్లో సదరం క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి డీఆర్డీవో శ్రీనివాస్ బుధవారం పత్రిక ప్రకటనలో తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... 10వ తేదీన దృష్టి లోపం ఉన్నవారు, 11వ తేదీన ఆర్థోపెడిక్ హ్యాండీ క్యాప్డ్ ఉన్నవారు పట్టణంలోని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ నందు ఉదయం 9 గంటలకు రావాలని తెలిపారు.

అంబలి కేంద్రాన్ని సందర్శించిన మాజీ మంత్రి

నిర్మల్ రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : పాకాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత అంబలి కేంద్రాన్ని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి బుధవారం సందర్శించారు. కార్యక్రమంలో ధర్మాజీ రాజేందర్, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ రమణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్ యాదవ్, అనుముల బాస్కర్, రవి, వినయ్, ఆత్రాశి సింగ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఏడుగురు వెటర్నరీ అసిస్టెంట్లకు పదోన్నతులు

భైంసా, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : పశుసంవర్ధకశాఖలోని వెటర్నరీ అసిస్టెంట్లకు లైవ్‌స్టాక్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. జోన్ 2 పరిధిలో మొత్తం 43 మంది పదోన్నతులు కల్పించగా ఇందులో జిల్లా నుంచి 7 గురు వెటర్నరి అసిస్టెంట్లు ఉన్నారు. పదేళ్ల తరువాత అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించబడ్డాయి. జిల్లాలో వెటర్నరీ అసిస్టెంట్ల నుంచి లైవ్‌స్టాక్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందిన వారి వివరాలు. నిర్మల్, ఖానాపూర్, ముథోల్ కేంద్రాల్లోని ఏరియా వెటర్నరీ ఆసుపత్రులకు చెందిన వెటర్నరీ అసిస్టెంట్లు డా. జె.అనిల్, డా. సీహెచ్, క్రాంతి కుమార్, డా. జె.సుస్మిత, మంజూలాపూర్, కుంటాల, తానూర్, భైంసా ప్రాథమిక పశువైద్యశాలలకు చెందిన వెటర్నరీ అసిస్టెంట్లు డా. ఎన్. సునిల్, డా. జి.రాజేశ్వర్, డా. టి.అమృతం, డా. జే. కైలాస్‌లు లైవ్‌స్టాక్ అసిస్టెంట్లుగా పదోన్నతులు పొందారు.

ఉరి వేసుకొని ఒకరి ఆత్మహత్య

లోకేశ్వరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజుర గ్రామానికి చెందిన పతాని నడిపి మల్లన్న(62) అనే వ్యక్తి బుధవారం చెట్టుకు ఉరి వేసుకొని మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం... మృతుడికి సంబంధించిన వ్యవసాయ భూమిలో దాదాపు ఇప్పటి వరకు 20 బోరు బావులు వేయగా నీరు పడకపోవడంతో బుధవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో అతని కొడుకు మహేష్‌కు పొలానికి వెళ్లి వస్తానని చెప్పి అతని వ్యవసాయ భూమిలో గల వేప చెట్టుకు ఉరి వేసుకొని చనిపోయాడు. మృతుడు ఎన్నిబోర్లు వేసినా నీరు పడకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులకు లోనై జీవితంపై విరక్తి చెంది ఉరి వేసుకొని చనిపోయాడు. అతని కుమారుడు మహేష్ ఫిర్యాదు మేరకు లోకేశ్వరం ఎస్సై అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.

కడెంలో సాగునీటి కోసం రైతుల ధర్నా



జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

కడెం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : కడెంలోని నచ్చన్ ఎల్లాపూర్ చౌరస్తా వద్ద సదర్మాట్ చివరి ఆయకట్టు వరకు సాగునీటిని విడుదల చేయాలని రైతులు జాతీయ రహదారి మీద ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. కడెం ఎస్సై కృష్ణసాగర్ రెడ్డి, తహసీల్దార్ ప్రభాకర్ ఘటన స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. అయినా ఫలితం లేకపోవడంతో ఈ నెల చివరి వరకు సాగునీటి విడుదల చేస్తామని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో రైతులు, నాయకులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధితో బాధిత కుటుంబాలకు బాసట

- ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్



చెక్కులను పంపిణీ చేస్తున్న ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్

భైంసా, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వివిధ అనారోగ్య కారణాలతో ప్రైవేట్, కార్పోరేట్ ఆసుపత్రులలో చికిత్సలు నిర్వహించుకున్న బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థికసాయం అందించి బాసటగా నిలుస్తున్నామని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ పేర్కొన్నారు. బుధవారం భైంసాలోని తన క్యాంపు కార్యాలయంలో డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలవాసులు ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాటిల్ మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు ఆర్థిక ఇబ్బందులు తొలగించి తోడ్పాటునిచ్చేందుకు సీఎం రిలీఫ్‌ఫండ్ ఎంతో సహాయకారిగా నిలుస్తోందన్నారు. బీజేపీ భైంసా మండల అధ్యక్షులు సిరం సుష్మారెడ్డి, బీజేవైఎం డివిజన్ ప్రతినిధి గంగా ప్రసాద్, అశోక్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

కుంటాల, ఏప్రిల్, 9 : (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కుంటాలలో బుధవారం పలువురు లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మీ, షాదీముబార్ చెక్కులను ముథోల్ ఎమ్మెల్యే రామరావు పటేల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కుంటాల రైతు వేదికలో పలు గ్రామాలకు చెందిన 16 మంది లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కమల్ సింగ్, మాజీ ఎంపీపీ రమణ రావు, అప్క గజ్జారాం, మాజీ ఎంపీటీసీలు పసుల మౌనిక నవీన్, పలు గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల సీనియర్ నాయకులు ఉన్నారు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

కలెక్టర్ అభిలాష అభినవ్



అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందేలా ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలను కల్పించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా పీహెచ్‌సీలలో వసతులు, మరమ్మతులు, ఇతర సామాగ్రికి సంబంధించిన వివరాలను వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించేలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అవసరమైన మౌలిక వసతులు కల్పించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి పీహెచ్‌లో పరిశుభ్రత ఉండాలని, వైద్య సిబ్బంది సమయపాలన పాటించి విధులు నిర్వహించాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న సదుపాయాలను సమీక్షించి, అవసరమైన మరమ్మతులు చేయాలని ఆయా శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో రాజేందర్, ఈఈ పీఆర్ శంకరయ్య, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, వైద్యశాఖల అధికారులు, రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు ఎంసీ లింగన్న, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

చిన్నారులు, గర్భిణీలలో రక్తహీనతను నియంత్రించేందుకు పోషకాహారంపై విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి పోషన్ పఖ్వాడ (పోషణపక్షం) కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ప్రదర్శించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో నాగమణి, ఏసీడీపీవో నాగలక్ష్మి, జిల్లా ఆసుపత్రి పర్యవేక్షకులు గోపాల్‌సింగ్, ఎంసీహెచ్ వైద్యులు సరోజ, జిల్లా సమన్వయకర్త నిరంజన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాలశక్తి కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

బాలశక్తి కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బాలశక్తి కార్యక్రమం అమలు తీరుపై విద్య, వైద్య, సంక్షేమ శాఖల అధికారులతో ఆమె జూమ్ కాల్ మాధ్యమం ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... బాలశక్తి కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలని ఆదేశిం చారు. విద్యార్థులందరికీ దశల వారీగా ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహిస్తూ సమగ్ర ఆరోగ్యకార్డులను తయారు చేయాలని సూచించారు. వేసవి సెలవుల నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్య స్థితిగతుల వివరాలు, అవసరమైన ప్రత్యేక పోషకాహారం, మందులను వారి పోషకులకు అందజేయాలని ఆదేశిం చారు. విద్య, వైద్యం, ఆర్థిక అక్షరాస్యతకు సంబంధించి విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేలా క్విజ్ పోటీలను నిర్వహించాలన్నారు. వేసవి సెలవులలో విద్యార్థులకు జీవితంలో ఉపయోగపడే పలు కోర్సులను నేర్చుకునే విధంగా ప్రోత్సహించాలని, ప్రత్యేక వేసవి శిబిరాలను నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఈవో పి. రామారావు, విద్యాశాఖ అధికారులు సలోమి కరుణ, లింబాద్రి, తదితరులు పాల్గొన్నారు.

దేశానికి స్వాతంత్ర్యం తెచ్చింది కాంగ్రెస్ పార్టీ



లక్ష్మణచాందలో మాట్లాడుతున్న కూచాడి శ్రీహరిరావు

లక్ష్మణచాంద, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : దేశానికి స్వాతంత్ర్యం తెచ్చింది కాంగ్రెస్ పార్టీ అని డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు బుధవారం అన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓడ్నాల రాజేశ్వర్ అధ్యక్షతన మండల కేంద్రంలో జరిగిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం ముగింపు సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీకి నాయకత్వం వహించి భారతదేశానికి స్వాతంత్ర్యం తేవటం కోసం కృషి చేసిన మహాత్మాగాంధీని హత్య చేసిన గాడ్సేను భారతీయ జనతా పార్టీ ఆరాధిస్తుందని విమర్శించారు. అంతకు ముందు అంబేద్కర్, గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ చిత్రపటం ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ దేశానికి దిశ, దశ గాంధీ - అంబేద్కర్‌ల సిద్ధాంతాలేనని ఆయన స్పష్టం చేశాడు. బీజేపీ ప్రజల మధ్య భావోద్వేగాలను రెచ్చగొడుతూ ఓట్లు దండుకునే కార్యక్రమం చేపట్టగా ప్రజాసంక్షేమమే ఎజెండాగా కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

చింతల్‌చందాలో దళితుల ఇంట్లో సన్నబియ్యం భోజనం.

మండలంలోని చింతల్‌చందాలో తాండ్ర రాజేశ్వర్ అనే దళిత కుటుంబంతో కలిసి సన్న బియ్యంతో వండిన భోజనం చేశారు. సన్న బియ్యం పథకం గురించి స్థానికులను ఆరా తీయగా సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు ఓడ్నాల రాజేశ్వర్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దుర్గాభవాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు ఈటెల శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ ఓస రాజేశ్వర్, నిర్మల్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నాందేడపు చిన్ను, నాయకులు తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో గాంధీజీ, అంబేద్కర్, రాజ్యాంగం చిత్ర పటాలతో ర్యాలీ



సోన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడ్తాల్, సాకెర గ్రామాల్లో బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మధుకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు జాతీయ నాయకుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామాల్లో గాంధీజీ, అంబేద్కర్, రాజ్యాంగం చిత్రపటాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం భారత రాజ్యాంగం రక్షణ కొరకై ప్రతిజ్ఞ చేయడం జరిగింది. అలాగే సన్న బియ్యం పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సన్నబియ్యంను లబ్దిదారులకు రేషన్ షాపుల ద్వారా అందించారు. ఈ కార్యక్రమంలో సోన్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మధుకర్ రెడ్డి, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు అల్లూరి కృష్ణవేణిరెడ్డి, మండల నాయకులు అల్లూరి రాజనర్సింహారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మ్యాక ప్రేమ్‌కుమార్, మోహినుద్దీన్, అంబేకర్ ప్రసాద్, శ్రీనివాస్, రితీష్ చారి, రమేష్‌రెడ్డి, బర్మ దాసు, రమణ, గుర్రం రాము, బర్మ శ్రీకాంత్, నవీన్, మండల పార్టీ నాయకులు, గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టుకు పాదయాత్ర

ముథోల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ముథోల్ మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామానికి చెందిన 25 మంది మాల ధారణ భక్తులు బుధవారం వేకువజామున కొండగట్టుకు పాదయాత్రగా బయలు దేరారు. మూడు రోజులపాటు పాదయాత్రగా వెళ్లి హనుమాన్ జయంతి నాటికి కొండగట్టుకు చేరుకోనున్నట్లు వారు తెలిపారు. పాదయాత్రగా బయలుదేరిన హనుమాన్ భక్తులకు మంగళహారతులు, ప్రత్యేక పూజలతో గ్రామస్థులు గ్రామ పొలిమేర వరకు సాగనంపారు.

ఎస్ఏ 2 పరీక్షలు 17 వరకు : డీఈవో

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల విద్యార్థులకు ఈ నెల 9 నుండి 17 వరకు ఎస్ఏ 2 పరీక్షలు నిర్వహించాలని డీఈవో రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ప్రధానోపాధ్యాయులకు టైం టేబుల్ విడుదల చేశారు. పరీక్షల అనంతరం జవాబు పత్రాలను మూల్యాంకన చేసి మార్కుల రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. 23న పేరెంట్స్ మీటింగ్ ఏర్పాటు చేసి ఫలితాలు అందించాలన్నారు.

భీమన్న గుట్ట స్థలాన్ని పరిరక్షించండి

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా కేంద్రంలోని భీమన్న గుట్ట ప్రాంతంలో 63 ఎకరాల స్థలం అన్యాక్రాంతం అవుతుందని దాన్ని పరిరక్షించాలని ముదిరాజ్ సంఘ నాయకులు అదనపు కలెక్టర్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. నాయకులు వై. సాయన్న, సుంకరి సాయి, పాతర్ల గణేష్, తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో అవినీతిని అరికట్టండి : పీడీఎస్‌యూ

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని గురుకులాల్లో జరిగే అవినీతి అక్రమాలు అరికట్టాలని పీడీఎస్‌యూ నాయకులు బుధవారం అదనపు కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. జిల్లా అధ్యక్షుడు మహేందర్ మాట్లాడుతూ... ఎవరికి తెలియకుండా అక్రమాలు జరుగుతున్నాయని ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. అక్రమాలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణంలోని నాళం ప్రహ్లాద్ తల్లి ఇటీవల మృతి చెందగా బుధవారం మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు. అయ్యన్నగారి భూమయ్య, శ్రీకాంత్ యాదవ్, తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : బర్కత్‌పురాలో 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న దృష్ట్యా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు తెలిపారు. ప్రియదర్శిని నగర్, సాగర్ కాలనీ, ఏరియా ఆసుపత్రి, బర్కత్‌పురా ప్రాంతాల్లో ఉదయం 8 నుండి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాల ప్రారంభం

నర్సాపూర్(జి), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తురాటి, చాక్‌పల్లి, బామ్ని(బి), గొల్లమాడ, బూరుగుపల్లి(కె), నందన్ గ్రామాల్లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏపీఎం సునంద బుధవారం ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అనుమతి ఇచ్చిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకే విక్రయించాలన్నారు.



ఆహ్వాన పత్రికను అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఆహ్వాన పత్రికలు

● చీర, దస్తీలతో బీఆర్ఎస్ నాయకుల ప్రత్యేక ఆహ్వానం

ఇచ్చోడ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఈనెల 27న వరంగల్ జిల్లాలో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలి రావాలంటూ ఆదిలాబాద్ జిల్లాలోని ఇచ్చోడ మండలం ముక్రా(కె) గ్రామంలో సభ ఆహ్వాన పత్రికలను బీఆర్ఎస్ నాయకులు బుధవారం ఇంటింటికీ పంచారు. ముక్రా(కె) మాజీ సర్పంచి, బీఆర్ఎస్ నాయకురాలు గాడ్గె మీనాక్షి గ్రామంలోని 25 కుటుంబాలకు చీర, దస్తీ, టోపీలను అందజేసి బొట్టుపెట్టి మరీ ఆహ్వాన పత్రికలను అందజేశారు. సభకు అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచి గాడ్గె మీనాక్షి మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలోనే తమ గ్రామం అభివృద్ధి చెందిందన్నారు. కేసీఆర్ మళ్లీ అధికారంలోకి వస్తేనే తెలంగాణ బాగుపడుతుందని, ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. సభకు గ్రామంలోని ప్రతిఒక్కరూ తరలి వెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గాడ్గె సుభాష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి పట్టివేత

ఉట్నూర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగోజి తండా ఎక్స్ రోడ్డు సమీపంలో అందిన సమాచారం మేరకు గంజాయి తరలిస్తున్న ముగ్గురిని పట్టుకున్నామని ఉట్నూర్ సీఐ గండికోట మొగిలి తెలిపారు. బుధవారం ఉట్నూర్ ఎస్సై మనోహర్ ముగ్గురు వ్యక్తులు పల్సర్ బైక్‌పైన గంజాయితో వస్తున్నారన్న పక్క సమాచారం మేరకు ఉట్నూర్ ఎక్స్‌రోడ్డు వద్ద గల హరినాయక్ పాత పెట్రోల్‌బంక్ వద్ద తనిఖీ చేపట్టారు. ఆదిలాబాద్ మండలం అసోద గ్రామానికి చెందిన కొమ్ర రాహుల్, జగిత్యాల జిల్లా రాయికల్‌కు చెందిన మెండే అనిల్, తురగా గౌతంలను పట్టుకుని వారిని తనిఖీ చేయగా.. వారి వద్ద సుమారు 1.120 గ్రాముల (1.25కేజీ) గంజాయి లభించిందన్నారు. వారిని విచారించగా వారు ఆదిలాబద్‌రూరల్ మండలం అశోద గ్రామం నుంచి జగిత్యాల జిల్లాలోని రాయికల్ మండలానికి వెళ్తున్నామని తెలిపారన్నారు. గంజాయితో పాటు అశోద గ్రామంలో గంజాయి ఇచ్చిన వ్యక్తిని, రాయికల్ మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులను కూడా అదుపులోకి తీసుకుని బైక్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇందులో ఏఎస్సై శ్రీరాములు, సిబ్బంది ఉన్నారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి గ్రామానికి చెందిన పందిరి శ్రీనివాస్ కిడ్నీ సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఎంకే మిత్ర సేవా సొసైటీ వారు మంగళవారం అతడి ఇంటికి వెళ్లి రూ.5 వేల ఆర్థిక సహాయం అందించి ఉదారత చాటుకున్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు తోట శివన్న, దొంతుల మధు, అశోక్, రాహుల్, దత్తు, తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న సొసైటీ సభ్యులు





● ఆదిలాబాద్‌లో అడుగంటుకు పోయిన లాండసాంగి వాగు దృశ్యాలు ఇలా..

అడుగంటుకు పోయిన లాండసాంగి వాగు

● ఆదిలాబాద్ పట్టణ ప్రజలకు తప్పని నీటి కష్టాలు ● అయినా.. ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టని అధికారులు

ఆదిలాబాద్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ పట్టణానికి తాగునీటిని సరఫరా చేసే లాండసాంగి వాగు అడుగంటుక పోవడంతో మంచినీటికి కష్టాలు తప్పవన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆదిలాబాద్ పట్టణానికి మిషన్ భగీరథ ద్వారా 18 డీఎంఎల్‌టీ లాండసాంగి ద్వారా 6 డీఎంఎల్‌టీ నీటిని నిత్యం తరలిస్తూ పట్టణ ప్రజలకు సరఫరా చేస్తున్నారు. అయితే గతంలో ఎన్నడు లేని విధంగా ఏప్రిల్ మాసంలోనే లాండసాంగి వాగులో నీటిదారలు అడుగంటుక పోవడంతో పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మున్సిపల్ పరిధిలోని 49 వార్డులకు గాను ఇప్పటికే కొన్ని వార్డుల్లో వంతుల వారీగా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. అలాగే తీవ్రమైన నీటి ఎద్దడి సమస్య ఉన్న కాలనీలకు ఫిల్టర్ బెడ్ నుంచి ప్రత్యేకంగా నీటి ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నా.. సమస్య పరిష్కారం కావడం లేదంటున్నారు. అయితే పట్టణ శివారు ప్రాంత కాలనీల్లో సమస్య తీవ్రమవుతున్నట్లు తెలుస్తుంది. డిమాండ్‌కు సరిపడా మంచి నీటిని సరఫరా చేయకపోవడంతో పలు కాలనీల్లో తాగునీటి కోసం తండ్లాట కనిపిస్తోంది. మున్సిపల్ అధికారులు అప్రమత్తం కాకుంటే రాబోయే మే, జూన్‌లలో నీటి సమస్య మరింత తీవ్రమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

'ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు యాత్ర'

బోథ్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): గడచిన సంవత్సరం నుంచి భారత రాజ్యాంగంపై వివిధ రూపాల్లో దాడులు జరుగుతున్నాయని, కేంద్రంలో ఉన్న ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చాలని ప్రయత్నిస్తోందని, రాజ్యాంగ పరిరక్షణకు ఈ యాత్ర కొనసాగుతోందని బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేద్కర్, మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జై భీమ్ జై బాబు జై సంవిధాన్ పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లా అధికార ప్రతినిధి చంటి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు యాదవ్, షేక్ నాజర్ అహ్మద్, తదితరులున్నారు.

జైనథ్: కేంద్రంలో అధికారంలో ఉన్న పీఎం నరేంద్రమోదీ బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తుందని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లి ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి సతీమణి కంది మౌనారెడ్డి తీవ్ర స్థాయిలో ఆరోపించారు. జైబాపు, జై భీం, జై సంవధాన్ పాదయాత్రలో భాగంగా బుధవారం జైనథ్ ఉమ్మడి మండలంలోని పిప్పర్‌వాడ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్‌రెడ్డి, సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్‌రావు, మాజీ ఎంపీటీసీ ఎం విమలప్రశాంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఎస్.వెంకట్‌రెడ్డి, తదితరులున్నారు.

తాంసి: కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బుధవారం జై బాబు జై భీమ్ అనే నినాదాలతో తాంసి మండలంలోని వడ్డాది, పొన్నారి గ్రామాలలో పాదయాత్ర నిర్వహించారు. రోడ్డు గుండా పాదయాత్ర చేసి గ్రామాల్లోని వీధుల గుండా తిరుగుతూ జై బాపు జై భీమ్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ కౌరాల సంతోష్ పలువురు నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బేల: మండలంలోని గూడ గ్రామంలో బుధవారం ఏఐసీసీ, పీసీసీ పిలుపు మేరకు జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు గవండే గన్‌శ్యాం, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోడె అవినాష్ మాట్లాడుతూ పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని అవమాన పరుస్తూ అప్రజాస్వామ్య పాలన సాగిస్తోందని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాజీ ఉప సర్పంచ్ గోడె దేరేవాన్, ఠాక్రే సుమిత్, గోడె నానాజీ, గోడే గన్‌శ్యాం, విపుల చందనకర, మనోహర్, అకుష్, పోచీరాం, వినోద్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

'అంగడి బజార్ వద్ద ప్లాస్టిక్ నిషేధం'

నార్నూర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): అంగడి బజార్‌కు వచ్చే వ్యాపారస్తులు ఇక ముందు కూరగాయలకు ప్లాస్టిక్ సంచులు వాడొద్దని ఎంపీడీవో జవర్, ఎంపీవో సాయిప్రసాద్ అన్నారు. బుధవారం అంగడి బజార్ వద్ద ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీవో సాయిప్రసాద్ మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లో ప్లాస్టిక్ సంచులు వాడొద్దని, ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయన్నారు. ప్లాస్టిక్ సంచులు వాడిన వారికి రూ.వెయ్యి జరిమానా విధిస్తామని హెచ్చరించారు. వారి వెంట సెక్రెటరీ మోతిరాం, తదితరులు ఉన్నారు.

వంట గ్యాస్ ధర పెంపుపై నిరసన

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం గ్యాస్ సిలెండర్ ధరను రూ.50 పెంచడాన్ని నిరసిస్తూ పెంచిన ధరను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ధరలు పెంచుతూ పేదలు, మధ్యతరగతి ప్రజల నడ్డి వీరుస్తుందని మండిపడ్డారు. కార్పొరేట్ వ్యాపారుల లబ్ధి కోసం బీజేపీ సర్కారు పని చేస్తోందని వారు ఈ సందర్భంగా ఆరోపించారు. అంతేగాకుండా గ్యాస్ రాయితీ సైతం తగ్గించి వేసిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు ఆర్ మంజుల, నాయకులు కే ఆశన్న, నగేష్, తదితరులు పాల్గొన్నారు.

● సామాన్యులపై పెను భారం : బీఆర్ఎస్

బోథ్: కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల వల్ల పేదలపై పెనుబారం పడుతుందని ప్రభుత్వం పెంచిన ధరలను తగ్గించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఆత్మ మాజీ చైర్మన్ మల్లెపూల సుభాష్ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెంచిన ధరలతో పేద ప్రజలపై భారం పడుతుందన్నారు. ముఖ్యంగా డీజిల్, పెట్రోల్ ధరల వల్ల వస్తు రవాణా చార్జీలు పెరగడంతో నిత్యవసర ధరలు పెరుగుతాయన్నారు. ప్రతీ ఇంటికి గ్యాస్ ధర పెరగడం వల్ల ఏడాదికి రెండు వేల రూపాయల వరకు భారం పడుతుందన్నారు. పెంచిన ధరలను ప్రభుత్వం తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎలుక రాజు, నారాయణ, ప్రవీణ్, మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు సోలంకి సత్యనారాయణ ఉన్నారు.

అటవీ శాఖలో ఇంటి దొంగలు!

(3వ పేజీ తరువాయి...)

వరుసగా అధికారులపై సస్పెన్షన్ వేటు వేయడంతో అటవీ శాఖ ఖాళీ అవుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలో ప్రస్తుతం పలువురు అధికారులు ఇన్‌చార్జి బాధ్యతలతోనే విధులు నిర్వహిస్తున్నారు. ఒక్కో అధికారికి రెండు, మూడు విధులను అప్పగించడంతో పర్యవేక్షణ కొరవడుతుందన్న వాదనలు వినిపిస్తున్నాయి. కింది స్థాయి సిబ్బందిపై పనిఒత్తిడి పెరగడంతో వారు కూడా విధుల పట్ల అంతగా ఆసక్తి చూపడం లేదన్నట్లు తెలుస్తుంది. ఇలాంటి పరిస్థితులతో స్మగ్లర్ల ఆగడాలకు అడ్డుకట్ట పడడం లేదు. బాధ్యతగా విధులు నిర్వహించే అధికారులే కరువయ్యారు. దీంతో దట్టమైన కవ్వాల్ అభయారణ్యం అడవులు పూర్తిగా పలుచబడి పోయి మైదాన ప్రాంతాలుగా మారుతున్నాయి. ఏటేటా అటవీ సంపద తరలిపోవడంతో మైదానాల విస్తీర్ణం భారీగా పెరిగిపోతోంది.

ఆశించిన స్థాయిలో కనిపించని మార్పు

రాష్ట్రంలోనే దట్టమైన అడవులకు కేంద్రమైన కవ్వాల్ అభయారణ్యం అడవుల రక్షణకు ప్రభుత్వం ఏరికోరి మరి ఉన్నత స్థాయి అధికారులను నియమిస్తుంది. కానీ ఆశించిన స్థాయిలో ఫలితం కనిపించడం లేదంటున్నారు. కలప అక్రమ రవాణాకు అసలు అడ్డుకట్ట వేయలేక పోతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. కవ్వాల్ అభయారణ్యం ప్రత్యేక అధికారి పర్యవేక్షణలో ఉన్న అక్రమ దందాలు సాగుతూనే ఉన్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతోనే కిందిస్థాయి సిబ్బంది చెప్పిందే లెక్కాగా మారింది. గత ఐదారేళ్లుగా జిల్లాలో ఉన్నత స్థాయి అధికారులు పని చేస్తున్నా.. ఆశించిన మార్పు కనిపించడం లేదంటున్నారు. జిల్లా అడవుల విస్తీర్ణం, సొంత శాఖపై పట్టు సాధించక పోవడంతో ఎవరికి వారే అవినీతి అక్రమాలకు పాల్పడుతూ అడ్డదారి సంపాదనకు ఎగబడుతున్నారు. అవినీతి అధికారులపై సస్పెన్షన్ వేటు వేస్తూ వదిలేస్తున్నా.. అటవీ శాఖను గాడిలో పెట్టే ప్రయత్నాలు జరగడం లేదంటున్నారు. కలప అక్రమంగా తరలిపోవడంతో పాటు వణ్యప్రాణులకు కవ్వాల్ అభయారణ్యంలో అసలు రక్షణే లేకుండా పోయిందన్న విమర్శలు లేకపోలేదు.

సేవలను సద్వినియోగం చేసుకోవాలి : సీఐ

తాంసి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పోలీసుల సేవలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్ రూరల్ సీఐ విష్ణువర్ధన్ అన్నారు. బుధవారం మండలంలోని గిరిజన గ్రామమైన అంబుగావ్ గ్రామంలో పోలీసులు మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గిరిజన కుటుంబాల్లో చదువుకున్న వారు ఉండాలని అప్పుడు ఇంటితో పాటు గ్రామం, సమాజం అభివృద్ధి చెందుతుంది అన్నారు. కార్యక్రమంలో ఎస్సై రాధిక, హెడ్ కానిస్టేబుల్ రమేష్, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

'సకాలంలో ప్రథమ చికిత్స అందాలి'

ఇచ్చోడ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): అత్యవసరంలో రోగులను సకాలంలో ఆసుపత్రికి చేర్చే ముందు ప్రథమ చికిత్స అందించేలా చూడాలని అంబులెన్స్ ప్రాజెక్టు మెనేజర్ సామ్రాట్ అన్నారు. బుధవారం ఇచ్చోడ మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఆవరణలో నిలిపి ఉన్న 108, 102 వాహనాలను తనిఖీ చేశారు. వాహనాలల్లో ఉన్న పరికరాలు, వాటి పనితీరును పరిశీలించారు. అన్నిరకాల మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఈఎమ్‌పీ కృష్ణ, రకేష్ పైలెట్ ఎండీ ఆలీం, సింగారం వినోద్, గణేష్, దీప్‌చంద్, తదితరులు పాల్గొన్నారు.

సన్న బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి

గుడిహత్నూర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పేదవాడి కడుపు నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేపట్టిందని కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ అన్నారు. బుధవారం మండలంలోని తోషంలోని ఎస్సీ కాలనీలో గల లబ్ధిదారుడు పొగల శంకర్ ఇంట్లో ఏఐసీసీ సభ్యుడు నరేష్ జాదవ్, మండల అధ్యక్షుడు కరుణాకర్‌లతో కలిసి ఆమె సన్న బియ్యంతో తయారు చేసిన భోజనం చేశారు. లబ్ధిదారులను నాణ్యత ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సుగుణ మాట్లాడుతూ ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్న బియ్యాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పదిహేను నెలల కాంగ్రెస్ పాలనతో

ప్రజలు ఆందోళన చెందుతున్నారు

●ఖానాపూర్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్



ఖానాపూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో 15 కాంగ్రెస్ పాలనతో ప్రజలు ఆందోళన చెందుతున్నారని బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్ అన్నారు. బుధవారం రాత్రి ఖానాపూర్‌లోని బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయ ఆవరణలో నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తలతో జాన్సన్‌నాయక్ వరంగల్ సభ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వమంటూ ప్రసంగాలలో ఊదరగొడుతున్న కాంగ్రెస్ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ప్రజల్లో ఎండగట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన లక్ష్యంగా 25 ఏళ్ల క్రితం ఆవిర్భవించిన నాటి టీఆర్ఎస్ నేటి బీఆర్ఎస్ పార్టీ ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ అయిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన లక్ష్యాన్ని ముద్దాడిందన్నారు. సాధించిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ దిశగా అభివృద్ధి చేసుకుంటున్న క్రమంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తిరిగి రాష్ట్రాన్ని కల్లోలం వైపు తీసుకెళ్తోందని ఆరోపించారు. తమ ప్రభుత్వం వచ్చే వరకు కార్యకర్తలను కడుపులో పెట్టుకొని చూసుకుంటానని జాన్సన్ పార్టీ శ్రేణులకు అభయమిచ్చారు. భారత రాష్ట్ర సమితి ఆవిర్భవించి 25 వసంతాలు పూర్తయిన సందర్భంగా ఈ నెల 27న వరంగల్ ఎల్కతుర్తిలో నిర్వహించనున్న రజతోత్సవ సభను విజయవంతం చేసేందుకు ఖానాపూర్ నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు భారీగా తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ రాథోడ్ జనార్ధన్, మాజీ జడ్పీటీసీలు రాథోడ్ రాము నాయక్, జానకిబాయి, మాజీ ఎంపీపీ అబ్దుల్ మోహిద్, మాజీ వైస్ ఎంపీపీ వాల్‌సింగ్, ఖానాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అబ్దుల్‌ఖలీల్, బీఆర్ఎస్ ఖానాపూర్ మండల అధ్యక్షులు రాజ గంగన్న, పట్టణ అధ్యక్షులు గౌరీకర్ రాజు, పెంబి మండల అధ్యక్షులు నరేందర్ రెడ్డి, జిల్లా నాయకులు కొక్కుల ప్రదీప్, శనిగారపు శ్రావణ్, కారింగుల సుమన్, పుప్పాల గజేందర్, గోవింద్, మహేందర్ సహా నియోజకవర్గంలోని పలు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలపై అవగాహన సదస్సు

లోకేశ్వరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పిప్రి గ్రామంలో బుధవారం కళాజాత బృందం ఆధ్వర్యంలో మూఢ నమ్మకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాజాత బృందం ఆధ్వర్యంలో చెట్లు, మూఢ నమ్మకాలపై ఉపాధి హామీ కూలీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. చెట్లను అధికంగా పెంచడంతో భూమిపై వేడిని తగ్గించవచ్చని పాటల రూపంలో వివరించారు. అనంతరం మూఢ నమ్మకాలపై మిమిక్రీ పాటల రూపంలో అవగాహన కల్పించారు. ఈ కార్య క్రమంలో నిర్మల్ జిల్లా కళాశాత బృందం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మాదిగ సంఘాల ఐక్య వేదిక సమావేశాన్ని జయప్రదం చేయండి

నిర్మల్ రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : గురువారం జరిగే జిల్లా మాదిగల సంఘాల ఐక్య వేదిక సర్వసభ్య సమావేశాన్ని జయప్రదం చేయాలని మాదిగల సంఘాల ఐక్య వేదిక నాయకులు కోరారు. జిల్లా కేంద్రంలోని మాదిగల అంబేద్కర్ సంఘం కార్యాలయంలో ఈ సమావేశం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో సంబంధిత అధికారులతో మాదిగ సంఘాల నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించినట్లు సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఏ. రాజేశ్వర్ గౌడ్ తెలిపారు.

అమరుల త్యాగాలు స్ఫూర్తిగా తీసుకోవాలి

● నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ● రాంజీ గోండుకు ఘన నివాళులు



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఏలేటి



నివాళులర్పిస్తున్న తుడుందెబ్బ నాయకులు

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : అమరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం రాంజీ గోండు వర్ధంతి సందర్భంగా చైన్‌గేట్ వద్ద విగ్రహానికి పూలమాల వేశారు. అమరుల త్యాగ దినం సందర్భంగా ఆయన తన నివాసంలో రాంజీ గోండు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాంజీ గోండు పోరాట పటిమని గుర్తు చేసుకున్నారు. ఏక కాలంలో ఆంగ్లేయులు, నైజాం పాలకులతో వీరోచిత పోరాటం చేసి గొప్ప వీరుడని కొనియాడారు. ఒకేసారి వేయి మంది అమరులను ఉరి తీసినారని వారని స్మరించుకోవాలన్నారు. వారి స్ఫూర్తి భావితరానికి అందించేందుకు కేంద్రం కృషి చేస్తోందన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాంజీ గోండు మ్యూజియం ఏర్పాటు చేయాలి

జిల్లా కేంద్రంలో రాంజీ గోండు మ్యూజియం ఏర్పాటు చేయాలని తుడుం దెబ్బ నాయకులు కోరారు. బుధవారం రాంజీ గోండు 165 వర్ధంతి నిర్వహించి ఆయనకు ఘన నివాళులర్పించారు. రాష్ట్ర నాయకుడు వెంకగారి భూమయ్య మాట్లాడుతూ... ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలన్నారు. ఆదివాసీలకు ఇంటి స్థలం, పోడు భూములకు పట్టాలివ్వాలన్నారు. ఆదివాసీలకు వ్యతిరేకంగా ప్రభుత్వాలు నడుస్తున్నాయన్నారు. రాంజీ గోండు సహా వేయి మంది అమరులు ప్రాణాలర్పించారని వారి స్మారకార్థం ఎలాంటి నిర్మాణాలు చేయ లేదన్నారు. వారి చరిత్ర భావితరాలకు అందజేయాల్సిన బాధ్యత ప్రభు త్వాలపై ఉందన్నారు. శ్రీనివాస్, గోవర్ధన్, భీమ్‌రావు, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

వేయి మంది అమరుల త్యాగ దినోత్సవం నిర్వహణ

నిర్మల్ కావేరి గ్రంథాలయంలో వేయి మంది అమరుల త్యాగ దినాన్ని బుధవారం నిర్వహించారు. రాంజీ గోండు స్మారక సమితి, కావేరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాంజీ గోండు చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. విదేశీ వలస పాలకులు, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి వేయి మంది గెరిల్లా యుద్ధ వీరులు ప్రాణత్యాగం చేశారని కొనియాడారు. వేయి ఉరుల మర్రి వద్ద ఒకే చెట్టుకు ఉరి తీశారన్నారు. డాక్టర్ యూ. కృష్ణంరాజు, పోలీస్ భీమేష్, దీపక్ రెడ్డి, రాజమణి, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ

మామడ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాయదారి గ్రామంలో కేంద్ర ప్రభుత్వం ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 10 లక్షల ద్వారా నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో బురదమయం లేకుండా సీసీ రోడ్లు, డ్రైనేజీలు కేంద్ర ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు బాపురెడ్డి, చక్రపాణి, కోంద్ర రాజారెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు రంజిత్ కుమార్, బీజేపీ నాయకులు గంగాధర్, సురేందర్, వెంకటేశ్వరరావు, నవీన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే

లక్ష్మణచాంద, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి బుధవారం మండలంలో పర్యటించారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన వివాహానికి హాజరై వధూవరులకు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు బీజేపీ నాయకులు ఉన్నారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

● నియోజకవర్గ ఇన్‌చార్జి కే. రామ్‌కిషన్‌రెడ్డి

నిర్మల్ రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పెద్ద సంఖ్యలో జన సమీకరణ చేసి విజయవంతం చేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి కే. రామ్‌కిషన్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కొండాపూర్ పార్టీ ఆఫీస్‌లో సోన్, నిర్మల్ మండలం బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయస్థాయి యోగాలో

సత్తా చాటిన విద్యార్థులు

ముథోల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లోని రబీంద్ర ఉన్నత పాఠశాల విద్యార్థులు యోగాసన స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, పంజాబ్‌లోని దినాక్‌కు చెందిన వారు గత నెల 21న నిర్వహించిన 16వ జాతీయ యోగ పోటీలకు ఎంపికై మంచి ప్రతిభ కనబరిచినట్లు రబీంద్ర పాఠశాల ప్రిన్సిపాల్ ఆసంవార్ సాయినాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్- 14 విభాగంలో జే. సమ్రత, జి. మధుప్రియలు (బాలికల విభాగంలో), జే. మహేష్ బాలుర విభాగంలోను బంగారు పతకాలు సాధించారు. అలాగే అండర్- 12 బాలిక విభాగంలో ఫమన్, జోయల్, బాలుర విభాగంలో మద్నేష్, మణికంఠ, యోగేష్‌లు అండర్- 8 విభాగంలో అఖిలేష్‌లు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సాయినాథ్ మాట్లాడుతూ... యోగ శారీరక, మానసిక ఉత్సాహాన్ని అందిస్తాయన్నారు. మా విద్యార్థులు మంచి ప్రతిభ కనబరచడం సంతోషదాయకం అన్నారు. ఈ సందర్భంగా యోగ గురువు ఉప్పు రవీందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే విద్యార్థులకు కరస్పాండెంట్ రాజేందర్, డైరెక్టర్లు పోతన్న యాదవ్, భీమ్ రావు దేశ్‌ముఖ్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉపాధి హామీపనులను పరిశీలించిన ఫీల్డ్ అసిస్టెంట్

లోకేశ్వరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను లోకేశ్వరం ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రకటించిన కొలతల ప్రకారం పనులు పూర్తి చేసి దినసరి కూలీ రూపాయలు 307 పొందాలని సూచించారు. అలాగే జాబ్ కార్డులో ఒకరి పేరు మీ మరొకరు రాకూడదని సూచించారు.

పురోగతి పంచాయతీల్లో గుండంపల్లికి 5వ స్థానం

దిలావర్‌పూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీలు సాధించిన పురోగతి ఆధారంగా కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ విడుదల చేసిన 'పంచాయతీ పురోగతి'లో రాష్ట్రంలోని 25 గ్రామ పంచాయతీలకు చోటు దక్కగా ఉమ్మడి జిల్లా నుంచి గుండంపల్లి, దేవుని గూడెం, పెసర కుంటలు ఎంపికయ్యాయి. తొలి పది స్థానాల్లో నిర్మల్ జిల్లా నుంచి గుండంపల్లి 81.28 మార్కులతో 5వ ర్యాంక్ సాధించగా మంచిర్యాల జిల్లా దేవునిగూడెం గ్రామానికి 80.49 మార్కులతో 9వ స్థానం దక్కింది. కొమురంభీమ్ జిల్లా దహెగాం మండలం పెసర కుంటకు 79.54 మార్కులతో 20వ స్థానంలో నిలిచింది.

వరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ముథోల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఏఎంసీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్ అన్నారు. మండలంలోని ఆష్ట గ్రామంలో బుధవారం స్వయం సహాయక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఆర్డీవో కోమల్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్ మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చెల్లింపులో మధ్యవర్తుల ప్రమేయానికి ఏమాత్రం ఆస్కారం లేకుండా ఆన్‌లైన్ విధానాన్ని తీసుకవచ్చిందన్నారు. కనీస మద్దతు ధరకు రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసి ఆన్‌లైన్ ద్వారానే రైతులకు నేరుగా రైతు ఖాతాలో డబ్బులు జమ చేయడం జరుగుతుందన్నారు. ఏ గ్రేడ్ రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 2,320, బి గ్రేడ్ రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 2,300లు ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే సన్నరకంకు రూ. 500 బోనస్ ఇవ్వడం జరుగుతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతులకు అన్ని విధాల ఆర్థికంగా ఎదిగేందుకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతుందన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం రైతుల అభివృద్ధి ధ్యేయంగా ముందుకు పోతుందని పేర్కొన్నారు. ముథోల్ మండలంలోని 12 గ్రామాల్లో ఈయేడు స్వయం సహాయక సంఘం ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం జరుగుతుందన్నారు. అలాగే ఆర్డీవో కోమల్‌రెడ్డి మాట్లాడుతూ... రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుంగా సెంటర్ల వద్ద అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన సెంటర్‌లోనే విక్రయించాలని, ప్రైవేట్ వ్యక్తుల వద్ద విక్రయించి నష్టపోవద్దని పేర్కొన్నారు. మొదటి రోజున ఆష్ట, చింతకుంట, చించాలలో వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో శివ కుమార్, డీఎం వెంకటేష్, ఏపీఎం గురు చరణ్, స్వయం సహాయక సంఘం అధ్యక్షురాలు ఎల్. కవిత, వీవోఏ శ్రీలత, సీసీలు వందేమాతరం, సూర్యకాంత్, పోశెట్టి, స్వయం సహాయక సంఘం సభ్యులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్వరం మండలంలో ..

లోకేశ్వరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజుర, గడ్‌చందా, కనకాపూర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐకేపీ ఏపీఎం మల్లేష్ మాట్లాడుతూ... ఐకేపీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఏ గ్రేడ్ రకానికి 2,320, బి గ్రేడ్ రకానికి 2,300 అలాగే సన్న రకానికి రూ. 2,300లు 500ల బోనస్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక రైతు వరి కొనుగోలు కేంద్రాల్లోనే వరిని కొనుగోలు చేయాలన్నారు. దళారులను నమ్మి మోసపోతున్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

కుంటాల, ఏప్రిల్, 9 : (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండలంలోని ఓలా గ్రామంలో ఇటీవల విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదంలో వడ్రంగి షెడ్లు దగ్ధం కాగా బాధిత కుటుంబాలను బుధవారం మోహన్ రావు పటేల్ ప్రజా ట్రస్ట్ చైర్మన్ బోస్లే మోహన్ రావు పటేల్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కోల్పోయిన రాజశేఖర్, రంజిత్, రాకేష్‌ల కుటుంబానికి అండగా ఉండాలనే నేపథ్యంతో దగ్ధమైన మూడు షెడ్లను వారం రోజుల్లో ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించేందుకు కృషి చేస్తానని అవసరమైన సామాగ్రిని కొనుగోలు చేసేందుకు బ్యాంకు ద్వారా రుణం అందించేందుకు కృషి చేస్తానన్నారు.

ఆంధ్రజ్యోతి పరిశీలన

లక్షల వ్యయం.. లాభాలు శూన్యం!

● పల్లె ప్రకృతి వనాల్లో కనిపించని మొక్కలు ● అధికారులు శ్రద్ధ చూపకపోవడంతో బోర్డులకే పరిమితమైన పల్లె ప్రకృతి వనాలు


దొంగతచింతలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం

ఉట్నూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేయడం ద్వారా లక్షల రూపాయలు వ్యయం చేసిన లాభాలు శూన్యం అయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లో పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటుచేయడం ద్వారా హరిత విప్లవం తీసుకు రావడానికి ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు ఎండమావిలా తయారయ్యాయి. ఉట్నూర్ మండలంలోని 37 గ్రామ పంచాయతీల పరిధిలో లక్షలాది రూపాయలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలు కేవలం బోర్డులకు పరిమితం అయ్యాయి. స్థానిక సంస్థలకు ఎన్నికైన ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో ఆలనా పాలనా చూసే విధంగా ప్రకృతి వనాల కోసం కేటాయించిన నిధులు నీళ్ల పాలు అయ్యాయి.

బోర్డులు, గేట్లు తప్ప ఏమి మిగలలేదు..

ఉట్నూర్ మండలంలోని 37 గ్రామ పంచాయతీల పరిధిలో 2019-21 సంవత్సరాల మధ్య అప్పటి ప్రభుత్వం పల్లె పల్లెకు ప్రకృతి వనాలు ఏర్పాటు చేసి హరిత విప్లవం తీసుకు రావాలని భావించింది. పల్లె పల్లెకు ప్రకృతి వనాలు ఏర్పాటు చేసినట్లయితే భారీగా మొక్కలు పెరిగి ఉదయం సాయంత్రం వ్యాయామం కోసం వచ్చే పిల్లలకు, వృద్ధులకు చక్కటి ఆహ్లాదకర వాతావరణం అందుబాటులోకి తేవాలని భావించింది. ప్రతీ గ్రామ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం పెన్సింగ్, బోర్డుల ఏర్పాట్ల కోసం రూ.60వేలు, పల్లె ప్రకృతి వనంలో అంతర్గత రోడ్ల కోసం రూ.50వేలు, గేట్ల ఏర్పాటు కోసం రూ.20 వేల నుంచి రూ.30వేల వరకు నిధులు ఖర్చు చేసి పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఏర్పాటు చేసిన నర్సరీల నుంచి పూలమొక్కలు, అలం కరణ మొక్కలు పండ్ల మొక్కలు, అటవి పల సాయం అందించే మొక్కలు నాటించారు. గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం అందిస్తున్న నిధులతో రెండేళ్ల పాటు నీళ్ల పోస్తూ, రక్షించే చర్యలు తీసుకున్న ప్రజా ప్రతినిధులు కాలం ముగియడంతో పదవి విరమణ పొందారు.


నడ్డంగూడలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం


హీరాపూర్(జె)లో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం

పంచాయతీల సెక్రటరీలు నిధులు రాకపోవడంతో నిరసించి పోయి పల్లె ప్రకృతి వనాల గురించి ఏ మాత్రం శ్రద్ధ చూపకపోవడంతో పల్లె ప్రకృతి వనాలు బోసిపోయి బోర్డులకు పరిమితమయ్యాయి. ఇప్పటికైనా ప్రభుత్వం పల్లె ప్రకృతి వనాలకు జీవం పోయడానికి నిధులు కేటాయించడంతో పాటు స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని గ్రామీణులు అంటున్నారు.


మొక్కలు లేని టక్కుగూడ పల్లె ప్రకృతి వనం


జమాల్ తండాలోని పల్లె ప్రకృతి వనం

ఆర్జీయూకేటీలో ఇంక్యుబేషన్ సెంటర్

● రూ.15 లక్షల నిధులను అందజేసిన రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్


వీసీ గోవర్ధన్‌కు చెక్కును అందజేస్తున్న గవర్నర్

బాసర, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీలో ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు కానుంది. ఈ మేరకు బుధవారం హైదరాబాదు రాజ్‌భవన్‌లో గవర్నర్ విష్ణదేవ్ రూ.15 లక్షల నిధులను మంజూరు చేశారు. దీనికి సంబంధించి గవర్నర్ వీసీ గోవర్ధన్‌కు చెక్కును అందజేశారు. ఈ నిధులను యూనివర్సిటీలో ఇంక్యుబెషన్ సెంటర్ ఏర్పాటుకు వినియోగించనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రగతి అవకాశాలను వినియోగించుకునేలా వినూత్న పారిశ్రామిక ఆలోచనలను ఏర్పాటే లక్ష్యంగా ఆ సెంటర్ పని చేయనున్నట్లు వీసీ తెలిపారు. ఈ సందర్భంగా వీసీ గోవర్ధన్ గవర్నర్ విష్ణదేవ్‌కు పుష్పగుచ్ఛమిచ్చి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

పొన్కల్‌లో వెంకన్న స్వామి బ్రహ్మోత్సవాలు


యజ్ఞగుండం దగ్గర పూజలు చేస్తున్న అర్చకులు


అలంకరించిన ఉత్సవ విగ్రహాలు

మామడ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొన్కల్ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణ, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విజయ సారథి, రామచంద్రచార్యులు తెలిపారు. భక్తులందరికీ తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామివారి కృపలో పాత్రులు కావాలని కోరారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించు కున్నారు.

వాటర్ షెడ్ ద్వారా జీవనోపాధి అవకాశాలు

● వాటర్ షెడ్ యాత్రను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ రాజార్షిషా

తలమడుగు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ప్రధానమంత్రి కృషి సంచాయి యువజన 2.0 వాటర్ షెడ్ పథకం భావితరాలకు జీవనో ఉపాధి అవకాశాలు లభిస్తాయని జిల్లా కలెక్టర్ రాజార్షి షా అన్నారు. బుధవారం అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం ఝరీ గ్రామంలో వాటర్‌షెడ్ యాత్రను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రజల స్థితిగతులను మార్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకం ద్వారా అనేక ప్రయోజనాలు చేకూరతాయన్నారు. ముఖ్యంగా భూగర్భ జలాల పెరుగుదలతో సాగునీటి సమృద్ధి సాగు విస్తరణలో పెరుగు దల, వృక్ష సంపద, పచ్చదనం పెరుగుదల, అలాగే గ్రామీణ యువతకు నైపుణ్య శిక్షణ ద్వారా మెరుగైన జీవనోపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. తలమడుగు మండలంలో ఇప్పటి వరకు రెండు కోట్ల నలభై లక్షల రూపాయలతో పనులు చేపట్టడం జరిగిందన్నారు. చెక్ డ్యాంల నిర్మాణం ఫంక్షన్ హాల్, షెడ్డు నిర్మాణం కమ్యూనిటీ భవనాల నిర్మాణం మహిళా సంఘాలకు ఒక్కొక్క మహిళకు 50 వేల రూపాయల ఆర్థిక సాయం అందించడం జరిగిందన్నారు. మండలంలో వాటర్ షెడ్ పనులు చాలా బ్రహ్మాండంగా జరుగుతున్నాయని వారిని అభినందించారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామల దేవి, డీఆర్‌డీఏ పీడీ రవీందర్ రాథోడ్. వాటర్ షెడ్ ప్రాజెక్టు అధికారి గోరకనాథ్, అడిషనల్ పీడీ గోవిందరావు, వాటర్ షెడ్ టెక్నికల్ అధికారులు మల్లేశ్వర్, మహేష్, తహసీల్దార్ రాజమోహన్, ఎంపీ డీవో చంద్రశేఖర్, ఐకేపీ ఏపీఎం సుభాష్ చంద్ర, వ్యవసాయ అధికారి ప్రమోద్ రెడ్డి, గ్రామస్థులు మాధవ్, నారాయణరెడ్డి, రామిరెడ్డి, మోహన్ రెడ్డి, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సన్న బియ్యం పథకం.. పేద ప్రజలకు వరం

సన్న బియ్యం పంపిణీతో పేద ప్రజలకు లబ్ది చేకూరుతుందని జిల్లా కలెక్టర్ రాజార్షిషా అన్నారు. బుధవారం తలమడుగు మండలం ఝరి గ్రామంలోని ఆదివాసి గిరిజన గిరిజనుడీ ఇంటిలో పేందర్ యాదవ్, కౌసల్యా బాయి ఇంట్లో కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసిన జిల్లా కలెక్టర్, కుటుంబ సభ్యులను కలెక్టర్ సన్న బియ్యం గురించి బియ్యం ఎలా ఉన్నాయి, అన్నం రుచికరంగా ఉందా అడిగి తెలుసుకున్నారు. సన్న బియ్యం పంపిణీతో మా కుటుంబం సంతోషంగా ఉందని, అన్నం రుచికరంగా ఉంద ని, బియ్యం చాలా బాగున్నాయని, సన్న బియ్యం పథకం మా కుటుంబానికి ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. కడుపునిండా భోజనం చేస్తున్నామని ఎంతో మంది నిరుపేదలకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతున్నదని, సన్న బియ్యం లభించడం మా అదృష్టంగా భావిస్తున్నామని కుటుంబీకులు తెలిపారు. అధిక డబ్బులు వెచ్చించి బియ్యాన్ని బయట కొనుగోలు చేయకుండా ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని తెలిపారు. ఈ పథకాన్ని అమలు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 356 రేషన్ షాపులకు గాను ఆరు లక్షల 32 వేల రేషన్ కార్డులు ఉన్న లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయడం జరుగుతుందన్నారు. ఏప్రిల్ 1వ తేదీన ప్రారంభించి ఇప్పటి వరకు తొమ్మిది రోజులలో 70 శాతం సన్నబియ్యం పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. మొత్తం జిల్లా వ్యాప్తంగా 4127 మెట్రిక్ టన్నుల బియ్యం, అదనంగా కొత్తగా 14,322 మంది చేరడం జరిగిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న నాణ్యత గల సన్న బియ్యం పంపిణీపై ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని కలెక్టర్ అన్నారు. అనంతరం సన్న బియ్యంతో భోజనం పెట్టిన కుటుంబ సభ్యులను కలెక్టర్ ఘనంగా సన్మానించారు. అదేవిధంగా వారి సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వాజిద్, సివిల్ సప్లై మేనేజర్ సుధా, తహసీల్దార్ రాజ్ మోహన్, ఎంపీడీవో చంద్రశేఖర్, ఐకేపీ ఏపీవో చంద్రశేఖర్, మండల వ్యవసాధికారి ప్రమోద్ రెడ్డి, పంచాయితీ సెక్రటరీ అశోక్, డీఆర్‌డీవో రవిందర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


ఝరిలో వాటర్ షెడ్ యాత్రను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్


డీఆర్డీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలిస్తూ..

కొత్త గ్రామ పంచాయతీ ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు వినతి

మండలంలోని ఉమ్మడి ఝరి గ్రామపంచాయతీ పరిధిలోని టోకీ గూడను కొత్త గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని షేర్‌గూడ, టోకి గూడ ఆదివాసి గిరిజనులు బుధవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. వెంటనే స్పందించిన కలెక్టర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఇం దులో మాజీ సర్పంచ్ జనక్ పటేల్, సకారం పటేల్, కోసే రావు, హను మంతు, రాజారామ్, జంగు తదితరులు పాల్గొన్నారు.

'వేద విద్యార్థి మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలి'


నిరసన తెలుపుతున్న స్థానికులు

బాసర, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): బాసరలోని వేద పాఠశాలలో చదువుతున్న విద్యార్థి మణికంఠ మృతికి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని బుధవారం బాసర గ్రామ వివిధ పార్టీల చెందిన నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయమై సరస్వతీ ఆలయం వద్ద వ్యాసముని ఆలయం ఎదుట నిరసన చేపట్టారు. అందరికీ వేదం అంటూ వేద పాఠశాలను ఏర్పాటు చేసి గోదావరి హారతి,బీజాక్షరాల పూజలు నిర్వహిస్తున్నారన్నారు. బాసరకు వచే యాత్రికుల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నరని వాపోయారు. తూప్రాన్‌కు చెందిన లోహిత్ అనే వేద విద్యార్థిపై విచక్షణరహితంగా దాడి చేయడం వల్లనే తీవ్రంగా గాయపడ్డడని ఆరోపించారు. ఇది మరువకముందే తాజాగా మరో విద్యార్థి మణికంఠ నిత్యహారతి పూజ నిర్వహించే గోదావరి ఘాట్‌లో మృతిచెందడని ఇవన్నీ వేదపాఠశాల నిర్వహకుల నిర్లక్ష్యంతో చోటుచేసుకున్నయని చెప్పారు. పోలీసులు పూర్తి విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం బాసర పోలీస్ స్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు. అయితే మణికంఠ విద్యార్థి ఘటనలో వేద పాఠశాల నిర్వాహకులపై కేసు నమోదు చేశామని ఇంకా దర్యాప్తు కొనసాగుతుందని బాసర ఎస్సై గణేష్ తెలిపారు. నిరసన కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన స్థానిక నాయకులు ప్రతాప్‌రావు, ఎమ్.రమేష్, సంజీవ్ రావు దేశాయి, గంగాశ్యామ్ పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీలో కాంట్రాక్ట్ ప్రొఫెసర్ల ఆందోళన

● అదనపు బాధ్యతలను నిర్వహించలేమంటూ ఆయా పోస్టులకు మూకుమ్మడి రాజీనామా


రాజీనామా పత్రాలతో పరిపాలన భవనం వద్ద కాంట్రాక్ట్ అధ్యాపకులు


పరిపాలనా అధికారికి రాజీనామా పత్రాలను అందజేస్తున్న దృశ్యం

బాసర, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 21ని వ్యతిరేకిస్తూ నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీలో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఆందోళన చేశారు. ఇకపై తాము ఎలాంటి అదనపు బాధ్యతలను నిర్వహించలేమంటూ బుధవారం ఆయా పోస్టులకు సంబంధించి.. మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. ఈ మేరకు తమ రాజీనామా లేఖలను వర్సిటీ పరిపాలన అధికారి రణధీర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు మాట్లాడుతూ కొన్నేళ్లుగా టీచింగ్‌తో పాటు వర్సిటీలో ఖాళీగా ఉన్న పోస్టులకు సంబంధించి అదనంగా పరిపాలనా బాధ్యతలను నిర్వహిస్తూ విశ్వవిద్యాలయ అభివృద్ధికి కృషి చేశామన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం తమ సేవలకు గుర్తింపు లేకపోవడమే కాకుండా క్రమబద్ధీకరణకు సంబంధించి ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. దీన్ని తాము ఖండిస్తున్నామన్నారు. కొన్నేళ్లుగా తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతున్నా.. ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదని ఆవే దన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో అదనపు బాధ్యతలను నిర్వహించడం న్యాయం కాదని భావించి తాము రాజీనామా మార్గాన్ని ఎంచుకున్నట్లు తెలిపారు. ఇకపై తాము కాంట్రాక్ట్ ప్రొఫెసర్లుగానే కొనసాగుతామని అంతే తప్పా వర్సిటీలో అదనంగా పాలనపరమైన పోస్టుల్లో కొనసాగబోమని వారు స్పష్టం చేశారు.


ఇచ్చోడ మండల కేంద్రంలో ఉన్న అగ్నిమాపక శకటం


రాంనగర్ గ్రామంలో అగ్ని ప్రమాదంలో కాలిబూడిదైన ఇల్లు (ఫైల్)

కలగానే అగ్నిమాపక కేంద్రం

● నేతల మాటలు నీటి మూటలే

బోథ్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): బోథ్ మండల ప్రజల చిరకాల కోరిక అయిన అగ్నిమాపక కేంద్రం కలగానే మిగిలిపోయింది. ప్రతి ఏటా కోట్లాది రూపాయల ఆస్తులు అగ్ని ప్రమాదంలో బూడిదవుతున్న స్థానిక ప్రజల డిమాండ్ మాత్రం అధికారుల చెవికి ఎక్కడ లేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు.

● ఏటా తప్పని అగ్నిప్రమాదాలు

మండలంలో ప్రతి ఏడాది అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోవడం ఫలితంగా లక్షల రూపాయలు ఆస్తులు బుగ్గి అవుతున్నాయి. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడల్లా స్థానికులు ఆందోళన కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుంది. ఆ తర్వాత మంజూరు చేపిస్తామంటూ నేతలు తీపి మాటలు చెప్పి ప్రజలను మెప్పిస్తున్నారు. గతంలో అప్పటి స్థానిక శాసనసభ్యులు రాథోడ్ బాబురావు ఫైర్ స్టేషన్ మంజూరు చేస్తామని ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దంటూ పేర్కొనడం జరిగింది. అయితే ఇప్పటికి ఫైర్ స్టేషన్ మంజూరీ కాకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

● కోట్లాది రూపాయల ఆస్తి బూడిద పాలు

ప్రతి ఏడాది మండలంలో కోట్ల రూపాయల ఆస్తులు అగ్నిప్రమాదాల కారణంగా బూడిదవుతున్నాయి. అయితే బాధితులు ఎంత మొత్తుకున్న జరిగే నష్టాన్ని ఆపలేకపోతున్నారు. కంటి తుడుపు చర్యగా రెవెన్యూ అధికారులు సంఘటన స్థలాలను సందర్శించి పంచనామా నిర్వహించి వెళ్లిపోతున్నారు. అయితే బాధితులకు మాత్రం నష్టపరిహారం నయాపైస అందకపోవడంతో తీవ్ర ఆందోళన అవుతున్నారు.

● ఆందోళనలు చేసినా ఫలితం శూన్యం

ఫైర్ స్టేషన్ మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ గతంలో మండల కేంద్రానికి చెందిన యువకులు ఆందోళన కార్యక్రమాలను చేపట్టారు. ఫైర్ స్టేషన్ మంజూరీతో పాటు పలు డిమాండ్లతో రిలే నిరాహార దీక్షలు చేపట్టిన ఫలితం లేకుండా పోయింది. ఎన్నికల ప్రచారంలో వచ్చిన ప్రతి నాయకుడు ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేస్తామంటూ హామీ ఇచ్చి వెళ్లిపోయారు. అధికారం మారిన స్థానికులకు మాత్రం ఫైర్ స్టేషన్ మంజూరి కాకపోవడంతో పాలకులపై ప్రజలు ఆగ్రహం వ్యక్తపరుస్తున్నారు. ఏది ఏమైనా ఫైర్ స్టేషన్ మంజూరి కోసం స్థానికులు ఎదురుచూస్తున్నారు.

కడెంలో వీర హనుమాన్ విజయ యాత్ర



విజయ యాత్రలో పాల్గొన్న యువకులు, హనుమాన్ స్వాములు

కడెం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కడెంలో వీర హనుమాన్ విజయ యాత్ర కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. పాండ్వాపూర్ హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి పెద్దూర్‌లోని హనుమాన్ ఆలయం వరకు వీర హనుమాన్ విజయ యాత్ర నిర్వహించారు. ఆయా గ్రామాల మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు, బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ పాల్గొన్నారు.

కొండగట్టుకు పాదయాత్ర

లక్ష్మణచాంద, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పార్‌పెల్లి గ్రామం నుంచి కొండగట్టుకు హనుమాన్ మాల ధారణ స్వాములు బుధవారం పాదయాత్ర చేశారు. కొండగట్టులోని హనుమాన్ ఆలయంలో దేవుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయనున్నట్లు వారు తెలిపారు. ఈ పాదయాత్రలో పార్‌పెల్లి, మల్లాపూర్ గ్రామాలకు చెందిన యువ స్వాములతో పాటు మహిళా స్వాములుండటం విశేషం.


కొండగట్టుకు బయలుదేరిన స్వాములు





- జిల్లాలోని కవ్వాల్ టైగర్ జోన్‌లో విచ్చలవిడిగా అక్రమ దందా
- అధికారులే దోపిడీ దందాకు ఎగబడుతున్న వైనం
- రెండు నెలల్లోనే ఇద్దరు అధికారులపై సస్పెన్షన్ వేటు
- ఉన్నత స్థాయి అధికారిని నియమించినా.. మారని తీరు
- అడ్డగోలు సంపాదనకు ఎంతకైనా తెగిస్తున్న అక్రమార్కులు

అటవీ శాఖలో.. ఇంటి దొంగలు

ఆదిలాబాద్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): జిల్లా అటవీ శాఖలో కొందరు ఇంటి దొంగలు అక్రమ సంపాదన కోసం ఎగబడుతున్నారు. కంచె చేనును మేసిన చందంగా కొందరు అధికారులు వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు దారి తీస్తోంది. అడవులకు రక్షణగా ఉండాల్సిన అధికారులే అడ్డదారి దందాలకు పాల్పడుతున్నారు. జిల్లా అటవీ శాఖలో పలువురు అధికారులపై తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. అయితే దొరికితే దొంగ లేదంటే దొర అన్నట్లుగా కొందరు అధికారులు కలప అక్రమ రవాణాకు పాల్పడుతున్న ట్లు ఫిర్యాదులు ఉన్నాయి. అధికారులే కలప స్మగ్లర్లతో చేతులు కలుపడంతో అక్రమ రవాణాకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. జిల్లాలో విస్తరించి ఉన్న దట్టమైన కవ్వాల్ అభయారణ్యాన్ని కాపాడేందుకు ఎన్నో ప్రయత్నాలు జరుగుతున్నా.. ప్రయోజనమే లేకుండా పోతోంది. రాత్రీ పగలు అనే తేడా లేకుండా అడ్డదారుల్లో అక్రమంగా కలపను తరలిస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. ఇంటి దొంగలను ఈశ్వరుడైన పట్టలేడన్న చందంగా అటవీ శాఖ పరిస్థితి కనిపిస్తోంది. జిల్లాలో ఉట్నూర్, ఇంద్రవెల్లి, సిరికొండ, ఇచ్చోడ మండలాల్లో విస్తరించి ఉన్న కవ్వాల్ అభయారణ్యం మైదాన ప్రాంతంగా మారుతోంది. దట్టమైన కవ్వాల్ అభయారణ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతున్నా.. ఫలితం కనిపించడం లేదంటున్నారు. గత రెండు నెలల క్రితమే ఓ డిప్యూటీ రేంజ్ అధికారిపై సస్పెన్షన్ వేటు వేసిన అటవీ శాఖ ఉన్నతాధికారులు.. తాజాగా సిరిచెల్మ పరిధిలోని డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఎ.నరేష్ ప్రభుత్వ వాహనం(టీఎస్30టీ 1970)లో అక్రమంగా వెదురు కలపను తరలిస్తుండగా అటవీ శాఖాధికారులకు పట్టుబడడం తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే ఆయనపై సస్పెన్షన్ వేటు వేయడం అటవీ శాఖలో చర్చనీయాంశంగా మారింది. అక్రమ సంపాదన కోసం కొందరు అధికారులు ఎంతకైనా తెగిస్తున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. కొంత మంది అవినీతి అధికారుల తీరుతో అటవీ శాఖ పనితీరు అబాసుపాలవుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే అవినీతి అక్రమాలకు అడ్డుకట్ట పడడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

సస్పెన్షన్‌తోనే సరిపెడుతున్నారు

అటవీ శాఖలో కొంతమంది అధికారులు అక్రమాలు, అవినీతికి పాల్పడుతున్నారన్న ఆరోపణలు రావడంతో సస్పెన్షన్ వేటు వేస్తూ సరిపెడుతున్నారన్న వాదనలున్నాయి. కఠినమైన చర్యలు తీసుకోక పోవడంతోనే అధికారుల అవినీతి భాగోతం వెలుగు చూస్తునే ఉంది. అవినీతికి అలవాటు పడిన కొందరు అధికారులు ఉన్నతాధికారులనే తప్పుతోవ పట్టిస్తున్నట్లు తెలుస్తుంది. సిరికొండలో అక్రమంగా నిల్వ ఉంచిన టేకు కలప దుంగలను పట్టుకున్న వాటి వివరాలను దాచిపెట్టి తప్పుడు కేసును నమోదు చేయడంతో ఓ అధికారిపై సస్పెన్షన్ వేటు పడింది. తాజాగా మరో అధికారిపై సస్పెన్షన్ వేటు వేయడం అటవీ శాఖలో పరిపాటిగా మారిందంటున్నారు. అవినీతి అధికారులపై సస్పెన్షన్ వేటు వేస్తూ చేతులు దులుపుకుంటున్నారే తప్ప క్షేత్రస్థాయిలో జరుగుతున్న అక్రమ దందాలకు అడ్డుకట్ట వేయలేక పోతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. గుట్టుచప్పుడుకాకుండా స్మగ్లర్లతో అధికారులే చేతులు కలిపి కలప అక్రమ రవాణాకు తెరలేపుతున్నట్లు తెలుస్తుంది. అక్రమ సంపాదనకు అలవాటు పడి న కొంతమంది అధికారులు మళ్లీ విధుల్లోకి చేరి అవే దందాలకు పాల్పడుతున్నారు. అవినీతి ఆరోపణలు వస్తున్న అధికారులను కవ్వాల్ అభయారణ్యం విధుల నుంచి పూర్తిగా తప్పించాలన్న డిమాండ్లు వస్తున్నాయి.

సస్పెన్షన్ నోటీసులు జారీ చేశాం

: రేవంత్‌చంద్ర, ఎఫ్‌డీవో, ఉట్నూర్

ఇటీవల డీఆర్‌వో ఎనరేష్ అక్రమంగా వెదరు కలపను తరలిస్తూ పట్టుబడడంతో ఆయనపై సస్పెన్షన్ వేటు వేసి నోటీసులు జారీ చేయడం జరిగింది. ప్రాథమిక విచారణ చేపట్టి ఉన్నతాధికారుల ఆదేశాలతో చర్యలు తీసుకున్నాం. ఆయన స్థానంలో మరోకరికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించాం. అక్రమాలకు పాల్పడిన అధికారులపై శాఖపరమైన చర్యలు తప్పవు. కవ్వాల్ అభయారణ్యంపై మరింతగా నిఘాను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం.



● అడవుల్లో నరికివేతకు గురైన వృక్షాలు ఇలా.. (ఫైల్)

ఖాళీ అవుతున్న అటవీ శాఖ

కలప అక్రమ రవాణాను అడ్డుకొని అడవులకు రక్షణ కల్పించాల్సిన అధికారులే అక్రమ కేసుల్లో చిక్కుకొని విధులకు దూరమవుతున్నారు. అసలే అటవీ శాఖను సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. దీనికి తోడు

(తరువాయి 4వ పేజీలో...)



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

వినూత్నంగా మెసేజ్ యువర్ ఎస్పీ

- వాట్సాప్ ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చే అవకాశం
- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. బుధవారం మేసేజ్ యువర్ ఎస్పీ అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్న ఫోన్ నెం. 8712659973 వాట్సాప్ ద్వారా సమాచారం అందించి పోలీసులను సంప్రదించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. నేరుగా ఫిర్యాదు చేయలేని వారు సుదూర ప్రాంతాల ఉంచి జిల్లా కేంద్రానికి వచ్చే అవసరం లేకుండా వాట్సాప్ ద్వారా మెసేజ్ రూపంలో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం, మొబైల్ వినియోగం అందుబాటులోకి రావడం వల్ల జిల్లా అధికారులను సులువుగా సంప్రదించే అకాశం ఉందన్నారు. పోలీసుల సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకే మెసేజ్ యువర్ ఎస్పీ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా జిల్లా ప్రజలకు మరింత వేగవంతమైన సేవలను అందిస్తామన్నారు. మెసేజ్ యువర్ ఎస్పీ కార్యక్రమం ఎంతో తోడ్పడుతుందన్నారు. సమస్యలపై పూర్తి వివరాలను రాసి వాట్సాప్ ద్వారా తెలపాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం వాట్సాప్ సేవలు అందుబాటులో ఉంటాయని దీనిపై స్వయంగా తన పర్యవేక్షణ ఉంటుందని ఎస్పీ పేర్కొన్నారు.

● మహిళల భద్రత కోసం షీటీం బృందాలు

ఆదిలాబాద్ రూరల్: జిల్లావ్యాప్తంగా ఉన్న మహిళలు, చిన్నారులు ఎలాంటి భయాందోళనలు లేకుండా, ఎటువంటి సమస్యలు ఉన్న ఆదిలాబాద్ షీ టీం బృందాన్ని సంప్రదించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్ ముఖ్య కార్యాలయంలో షీ టీం బృందంచే సమీక్ష సమావేశం నిర్వహించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. మహిళలు, చిన్నారుల సమస్యలపై ఆదిలాబాద్ షీ టీంను ఫోన్ నెం. 8712659953 ద్వారా సంప్రదించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు.

ఇన్‌చార్జి పరిపాలన అధికారిగా వేణు మాధవరెడ్డి బాధ్యతల స్వీకరణ

ఉట్నూర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం ఇన్‌చార్జి పరిపాలన అధికారిగా వేణు మాధవ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన జాదవ్ గోపాల్‌నాయక్ గత నెలలో ఉద్యోగ విరమణ చేయడంతో గిరిజన సంక్షేమ శాఖ అధికారులు వేణుమాధవరెడ్డిని ఇన్‌చార్జిగా నియమించారు. గిరిజన సంక్షేమ శాఖ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో వేణుమాదవరెడ్డిని కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించారు. ఇందులో కేటీసీ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు

● డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించని ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ పేర్కొన్నారు. బుధవారం జిల్లాలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులను ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రుల్లో రేట్ చాట్, రికార్డులు, ఫైర్ సేఫ్టీ, లైసెన్స్, డాక్టర్ల సర్టిఫికెట్లను ఆయన పరిశీలించారు. వేసవి నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా ఫైర్ సేఫ్టీ సరి చేసుకోవాలని సూచించారు. ఆస్పత్రిలో పనిచేసే డాక్టర్లు క్వాలిఫై ఉండాలని ఆయన స్పష్టం చేశారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

● పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎల్‌వో

నేరడిగొండ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎల్‌వో డాక్టర్ సాగర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీకి వచ్చిన రోగులను పరీక్షించి మందులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి సమయపాలన పాటిస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని సూచించారు. అంతకుముందు పలు రికార్డులను పరిశీలించారు. డాక్టర్ సద్దాం, హెచ్ఈవో పవార్ రవిందర్, హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్, ఫార్మాసిస్టు శ్రీనివాస్, స్టాఫ్ నర్సు స్వప్న, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్ రెడ్డి, తదితరులు ఉన్నారు.



కుంటాల పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న జీసీడీవో మెస్రం ఛాయా

పకడ్బందీగా ఎస్ఏ-2 పరీక్షలు : జీసీడీవో

నేరడిగొండ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పకడ్బందీగా సమ్మెటివ్ అసెస్‌మెంట్ (ఎస్ఏ-2) పరీక్షలు జరుగుతున్నాయని జీసీడీవో మెస్రం ఛాయా అన్నారు. బుధవారం మండలంలోని లఖంపూర్, కుంటల బాలికల ఆశ్రమ పాఠశాలలో జరుగుతున్న పరీక్షలను పరిశీలించారు. విద్యార్థులు భయపడకుండా పరీక్షలు రాయాలని అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరం ముగింపునకు చేరడంతో మండలంలో ఒకటో తరగతి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు బుధవారం నుంచి సమ్మెటివ్ అసెస్‌మెంట్ (ఎస్ఏ-2) పరీక్షలు ప్రారంభమయ్యాయన్నారు. ఎండల తీవ్రత నేపథ్యంలో ఉదయమే పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో కాంప్లెక్స్ హెచ్ఎం గుగ్లోత్ అంబారావు ఉన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం

గుడిహత్నూర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పురాతనమైన శివాలయంలో బుధవారం శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని (భారస్) ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు ఆలయానికి పెద్దసంఖ్యలో చేరుకుని ఆలయంలో దర్శనం కోసం బారులు తీరారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కొందరు భక్తులు ఆలయానికి కోడెద్దులను కానుకలుగా సమర్పించుకున్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు ఆరు గంటల వరకు ప్రధాన వీధుల గుండా రథ శోభాయాత్ర నిర్వహించారు. ఈ శోభాయాత్రలో భక్తి గీతాలు అలపిస్తూ మహిళలు, యువకులు నృత్యాలు చేశారు. అనంతరం వేదం మంత్రోచ్ఛరణల మధ్య శివపార్వతుల కల్యాణం జరిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

14 వరకు దరఖాస్తు చేసుకోవాలి

నార్నూర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువత కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన రాజీవ్ యువ వికాసం పథకానికి ఈనెల 14 వరకు దరఖాస్తు చేసుకోవాలని నార్నూర్ ఎంపీడీవో జవార్ అన్నారు. బుధవారం కార్యాలయం వద్ద మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 1195 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయగా కార్యాలయానికి మాత్రం 298 మంది మాత్రమే ఫారాలను అందజేశారని, మిగితా వారు కూడా త్వరలోనే అధికారులు ఫారాలు అందించాలని కోరారు. సమావేశంలో ఎంపీవో సాయిప్రసాద్, అర్జున్ పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌లో రాంజీగోండు చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న ఎంపీ, బీజేపీ నేతలు



ఉట్నూర్ మండలం రాంజీగోండునగర్‌లో సంప్రదాయ వాయిద్యాలతో పూజల కోసం వస్తున్న గిరిజనులు



సభలో మాట్లాడుతున్న ఏపీవో మనోహర్



ఇంద్రవెల్లిలో రాంజీగోండుకు నివాళులర్పిస్తున్న ఆదివాసీ సంఘాల నాయకులు



ఇచ్చోడలో నివాళులర్పిస్తున్న తుడుందెబ్బ నాయకులు

గిరిజన మొదటి తరం

స్వాతంత్ర్య సమరయోధుడు రాంజీగోండు

● ఎంపీ గోడం నగేష్ ● ఘన నివాళ్లు అర్పించిన నాయకులు, ఆదివాసీ గిరిజనులు ● జిల్లావ్యాప్తంగా 168వ వర్ధంతి వేడుకలు

ఆదిలాబాద్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మర్సుకోల రాంజీగోండు గిరిజన మొదటి తరం స్వాతంత్ర్య సమరయోధుడని ఎంపీ గోడం నగేష్ అన్నారు. బుధవారం రాంజీగోండు 165వ వర్ధంతి సందర్భంగా ఆయన నివాసంలో రాంజీగోండు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ 1857 సిపాయిల తిరుగుబాటులో బ్రిటిష్ ప్రభుత్వాన్ని గడగడలాడించిన చరిత్ర రాంజీగోండుకు దక్కుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలను ఏకం చేసి బ్రిటిష్ ప్రభుత్వం నిజాంలపై తిరుగుబాటు చేసిన అమరవీరుడు రాంజీగోండు సేవలను మరువరాదన్నారు. ప్రస్తుతం దీనిని బీజేపీ ప్రభుత్వం గుర్తించి రాంజీగోండు చరిత్ర భావితరాలకు అందించాలన్న ధృక్పథంతో ఆయన పేరిట రూ.25 కోట్లతో హైదరాబాద్‌లో మ్యూజియాన్ని నిర్మిస్తున్నామన్నారు. దేశంలో జూగా యోజన ద్వారా గిరిజనులను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో ప్రధాని నరేంద్రమోదీ ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రకాంత్, తరావత్ పాటిల్, శేఖర్, పెందూరు తులసీరాం, మేస్రం భూమన్న, వాగ్మారే శైలేందర్, రాజన్న, గిత్తే సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్: ఆదివాసీ గిరిజనుల హక్కుల సాధన కోసం మొదటి తరం ఉద్యమవీరుడు మరుసుకోల రాంజీగోండు స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని ఆదివాసీ నాయకులు ప్రకటించారు. బుధవారం ఉట్నూర్ మండలంలోని లక్కారం పంచాయతీ పరిధిలో ఉన్న రాంజీగోండు నగర్‌లో వర్ధంతి ఉత్సవ కమిటీ చైర్మన్ మరుసుకోల తిరుపతి ఆధ్వర్యంలో ఆదివాసీ గిరిజనుల సంప్రదాయ పద్ధతుల్లో రాంజీగోండు 165వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆదివాసీ సంప్రదాయ వాయిద్యాలతో మంగళహారతులు పట్టుకొని రాంజీగోండుచౌక్‌లో జెండా ఆవిష్కరణ చేశారు. ఆ తర్వాత సభను ఏర్పాటు చేసి రాంజీగోండు చిత్రపటానికి పూలమాలలు వేసి ఆదివాసీ గిరిజనులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఐటీడీఏ ఏపీవో పీవీటీజీ డాక్టర్ మేస్రం మనోహర్ మాట్లాడుతూ సాంఘిక, ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకోవడానికి తెల్లదొరలను ఎదిరించిన అమరుడు రాంజీగోండు స్ఫూర్తితో ఆదివాసీలు తమ హక్కుల సాధన కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. నిజాం రాజుల పాలనలో రాంజీగోండును బ్రిటీష్ పాలకులు అంతమొదించారన్నారు. ఐటీడీఏ ద్వారా ప్రతియేటా ఏప్రిల్ 9న అధికారికంగా నిర్వహించాలని కోరిన ఆదివాసుల డిమాండ్‌ను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి దృష్టికి తీసుకు వెళ్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా మేడి మేస్రం దుర్గుపటేల్, వర్ధంతి నిర్వహణ కమిటీ చైర్మన్ మరుసుకోల తిరుపతి, ఆర్టీఏ సభ్యులు దూట రాజేశ్వర్, కుమ్ర విఠల్, సలాం దేవ్‌రావు, ఆనంద్‌రావు, కొత్తపల్లి మహేందర్, సాజిద్, కుడుమిత సుధాకర్, సిడాం శేషు, మరసుకోల సరస్వతి, కుడుమెత హుస్సేన్‌రావు, కడమండ్ల రాజమని, భక్తు రాజన్న, తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఉట్నూర్ మండల కేంద్రంలోని రాంజీగోండు చౌక్‌లో ఆదివాసీ నాయకులు రాంజీగోండు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాంజీగోండు ఉద్యమ వీరత్వాన్ని గుర్తు చేసుకున్నారు. ఆత్రం భుజంగరావు, కుంరసాయి, తదితరులున్నారు.

ఇంద్రవెల్లి: దేశ స్వాతంత్ర్యం కోసం అలుపెరగని పోరాటం సాగించిన మహనీయుడు రాంజీగోండు అని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పూర్క బాపురావు అన్నారు. రాంజీగోండు వర్ధంతి సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని గోండుగూడ గ్రామ పటేల్ మడావి ఇంద్రు ఇంటి నుంచి అంజీ చౌరస్తా వరకు ఆదివాసీ సంప్రదాయ వాయిద్యాల మధ్య ర్యాలీ నిర్వహించి అంజీ చౌరస్తా వద్ద జెండాను ఆవిష్కరించి రాంజీగోండు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాంజీగోండు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేవరి చాహకటి నాగోరావు, ఆదివాసీ హక్కు ల పోరాట సమితి తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు పూర్క చిత్రు, గౌరవ అధ్య క్షుడు జుగ్నాక్ భారత్, జిల్లా కోశాధికారి కోట్నాక్ బారిక్ రావు, మాజీ సర్పంచులు కోరెంగ సుంకట్ రావు, మెస్రం నాగనాథ్, కనక తుకారం, గణేష్, తదితరులున్నారు.

ఇచ్చోడ: మండల కేంద్రంలోని కొమురంభీం కాంప్లెక్స్‌లో బుధవారం రాంజీగోండ్ 165వ వర్ధంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గొండ్ బొబ్బిలి రాంజీగొండ్ చేసిన పోరాటలను గుర్తుచేసుకున్నారు. అనంతరం రాంజీగొండ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ నాయకులు ఆత్రం మహేందర్, మురళికృష్ణ, నాగేందర్, వెంకటేష్, మల్లేష్, సుభాష్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: నైజం ఎదిరించి బ్రిటిష్ సైన్యాన్ని గడగడలాడించిన రాంజీ గోండు జీవితం నేటి సమాజానికి ఆదర్శమని బిఆర్ఎస్ నాయకులు ఆత్మ మాజీ చైర్మన్ ఎం.సుభాష్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో రాంజీ గోండు ఒక 165వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. బీఆర్ఎస్ యూత్ ప్రెసిడెంట్ మేడి చర్ల ప్రవీణ్ మండల ఉపాధ్యక్షుడు సోలంకి సత్యనారాయణ, బీసీ సెల్ మండల అధ్యక్షుడు భీమ బుచ్చన్న, సీనియర్ నాయకులు మడావి భీమ్రావు, సార్ మెడి జ్యోతిరం, ఆత్రం భీమ్రావు, యానప్ప, కనక కేశవ్, తదితరులు పాల్గొన్నారు.

నార్నూర్: స్వాతంత్ర్య సమరయోధుడు, ఆదివాసీ హక్కులకై పోరాడిన మర్సుకోల రాంజీగోండు ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పెందుర్ దాదిరావు అన్నారు. బుధవారం గాదిగూడ మండలంలోని ఖడ్కీ గ్రామంలో రాంజీగోండు 165వ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మడావి భగవంతు రావు, నాగోరావు పటేల్, పైకూ, చాహకటి జనతరావు, రాంసావు, రాము, చందు, మోహన్, జగన్నాథ్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

గుడిహత్నూర్: మండల కేంద్రంలోని ఆదివాసీ విజ్ఞాన కేంద్ర ఆవరణలో మర్సుకోల రాంజీగోండ్ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏర్పాటు చేసిన సమావేశంలో ఆదివాసి రాష్ట్ర అధ్యక్షుడు కోవదౌలత్ రావ్ మోకాశీ మాట్లాడారు. ఇందులో ఆదివాసి సేన ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు రాయిసిడం జంగు పటేల్, పేందోర్ శ్రీనివాస్, ఆదివాసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ కుంరం దశరథ్, ఆదివాసీ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి తోడషం లక్ష్మణ్, జిల్లా కోశాధికారి మండడి లక్ష్మన్, వెడ్మ చంపత్ రావు, ఆదివాసీ సేన మండల అధ్యక్షుడు సేడ్మకి భీంరావ్, తదితరులున్నారు.

సోనాల: ఆంగ్లేయులను ఎదురించి పోరాడిన వీరుడు రాంజీగోండు అని ఆదివాసి నాయకులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కొమరభీం చౌరస్తా వద్ద రాంజీగోండు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఇందులో అత్రం చైతు, కోవామురళి, గోవింద్ రావు, పోతన్న, శ్రీదర్, గంగారెడ్డి, నరేందర్, అమృత్ రావు, తదితరులు పాల్గొన్నారు.



సోనాలలో నివాళులర్పిస్తున్న నాయకులు



బోథ్‌లో నివాళ్లు అర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



గాదిగూడ మండలం ఖడ్కీ గ్రామంలో నివాళ్లు అర్పిస్తున్న దృశ్యం



గుడిహత్నూర్ మాట్లాడుతున్న ఆదివాసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు